దిగుబడి వచ్చినా నష్టమే

- మఠంపల్లి మండలంలో ముమ్మరంగా వరి కోతలు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తున్న అధికారులు
- మిల్లర్లు, దళారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్న రైతన్నలు


బోడబండతండా వద్ద పంట కోస్తున్న మిషన్

మఠంపల్లి : మండలంలోని చివరి ఆయకట్టు (టీ లాండ్)లో యాసంగి వరికోతలు పదిరోజులుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 30 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. అయినా గ్రామాల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ధాన్యాన్ని మిల్లర్లకు, వ్యాపారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం అందజేసే గిట్టుబాటు ధరతో పాటు బోనస్ పొందలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మఠంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గత వారం రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. వరదాపురం, పెదవీడు గ్రామాల్లోనూ ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు ప్రారంభించలేదు. అయితే మద్దతు ధర, బోనస్‌పై అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడంతోనే వారు మిల్లర్లు, వ్యాపారులనే ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడి కానీ..

మండలంలోని మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్ కాల్వల పరిధిలోని ఎర్రగట్టు, త్రివేణినగర్, బక్కమంతుల గూడెం, అల్లీపురం, కాల్వపల్లితండా, భీల్యానాయక్ తండా, బోడబండతండా, మఠంపల్లి, వేములూరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పరిధిలో అదేవిధంగా పలు ఎత్తిపోతల పథకాల పరిధిలోని యాతవాకిళ్ల, హనుమంతులగూడెం, దొనబండతండా, వరదాపురం, చెన్నాయిపాలెం, మంచ్యాతండా, రామచంద్రాపురంతండా పరిధిలో ప్రస్తుత రబీ సీజన్‌లో సుమారు 21 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అత్యధికంగా సన్న రకం ధాన్యం సాగు చేశారు. పది శాతం దొడ్డు రకం పంట సాగు చేపట్టారు. అయితే ప్రస్తుతం పంట దిగుబడి ఆశాజనకంగానే ఉందని, ఎకరాకు 35 బస్తాల నుంచి 40 బస్తాలు వస్తోందని రైతులు చెబుతున్నారు. కానీ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులకు అమ్ముకొని సరైన ధర పొందలేక పోతున్నమని అంటున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున మఠంపల్లి, చౌటపల్లి, భీల్యానాయక్‌తండా, యాతవాకిళ్లతో తదితర గ్రామాల్లో మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వ్యాపారులు దోచుకుంటున్నారు



ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి దోచుకుంటున్నారు. కావున ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర, బోనస్ అందేలా చూడాలి.

– తమ్మర శ్రీనివాసరెడ్డి, రైతు, చౌటపల్లి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



రైతులు పండించిన వరి ధాన్యాన్ని మఠంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్మితే గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ లభిస్తుంది. అలాగే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అధికారులు సహకరించాలి.

– బానోతు బాబునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మఠంపల్లి

మరిన్ని కేంద్రాలు ప్రారంభించాలి



మండలంలో మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించేలా అధికారులు అవగాహన కల్పించి వారికి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందేలా చూడాలి. కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగులను సకాలంలో అందించాలి. కాంటాలు వేసిన ధాన్యం వెంటనే తరలించేందుకు లారీలను పంపాలి. లేదంటే అకాల వర్షం కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

– కిరణ్‌యాదవ్, రైతు, మఠంపల్లి

క్లుప్తంగా

ప్రజలను చైతన్యం చేయడంలో కవుల పాత్ర కీలకం


నటుడు రత్నకుమార్‌ను సన్మానిస్తున్న క్రాంతినికేతన్ సేవా సంస్థ సభ్యులు

నేరేడుచర్ల : ప్రజలను చైతన్యవంతం చేయడంలో కవులు, రచయితల పాత్ర కీలకమని క్రాంతినికేతన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన కవి, రచయిత, నటుడు రత్నకుమార్‌ను సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆయన ఘనంగా సన్మానించి మాట్లాడారు. రత్నకుమార్ కవితలు, సామాజిక అంశాలతో కూడిన చిన్న సినిమాలు తీస్తూ ఆదర్శంగా నిలవడం అభినందనీయం అన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

చిలుకూరు : భారతరత్న, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని చిలుకూరు మండల కేంద్రంలోని రావి నారాయణరెడ్డి కాలనీలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

14న చివరి గడువు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 14 అని ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు ఫారంతో పాటు జత చేయాల్సిన పత్రాలను కలిపి ఎంపీడీఓ కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అందజేయాలని తెలిపారు.

రేషన్ డీలర్ల ఎంపిక చేపట్టాలి

మఠంపల్లి : సాధారణ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన మఠంపల్లి మండలంలోని 7 రేషన్ డీలర్ల ఎంపిక ప్రక్రియను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు దరావత్ లాలునాయక్, కామంచికుంటతండా గ్రామ మాజీ సర్పంచ్ సునీతానాయక్ కోరారు. ఆదివారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 2023 మే నెలలో రఘునాథపాలెంలో 2 రేషన్ దుకాణాలు, మఠంపల్లిలో 1, కామంచికుంటతండాలో 1, బక్కమంతులగూడెం 1, లాలితండా 1, భీమ్లా తండా 1 చొప్పున మొత్తం ఏడుగురు రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేసన్ విడుదల చేసిందని, 2023 సెప్టెంబర్‌లో అర్హత పరీక్ష తేదీని కూడా ప్రకటించిందని తెలిపారు. కానీ సాధారణ ఎన్నికల నోటిఫికేషన్‌తో నియామక ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. నిలిచిపోయిన రేషన్ డీలర్ల నియామక ప్రక్రియను వెంటనే ప్రారంభించి అర్హులకు సన్నబియ్యం అందేలా చూడాలని కోరారు. వారి వెంట మాజీ ఉపసర్పంచ్ సైదానాయక్, నాయకులు శంకర్ నాయక్, సుక్కోనాయక్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న తిరుకల్యాణ మహోత్సవాలు


పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాయంలో శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, నిత్యహోమం, సదర్శనహోమం, పూర్ణాహుతి, బలిహరణ, తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను గజ వాహనంపై బూరుగడ్డ మాచవరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆరగింపు, మంగళశాసనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో రహదారులు ఒక్కసారిగా చీకటిమయ్యాయి. ఉరుములు, మెరుపులు రావడంతో వడగళ్లు, పిడుగులు పడతాయని ప్రజలు ఆందోళన చెందారు. అనంతరం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. ఈదురుగాలులు వీచడంతో పాటు కాసేపు వర్షం కురిసింది. దీంతో ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. మండలంలో వరి కోతలు దాదాపు పూర్తికావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీతోనే దళితులకు న్యాయం


ర్యాలీలో పాల్గొన్న చీకోటి ప్రవీణ్‌కుమార్, బీజేపీ నాయకులు

కోదాడరూరల్ : బీజేపీతోనే దళితులకు న్యాయం జరుగుతోందని, వారికి అండగా నిలిచేది బీజేపీనేని బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన శుద్ధి చేసి మాట్లాడారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని 13 రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను నీరు, పాలతో శుద్ధి చేస్తామని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే భారత ప్రజలంతా దేశంలో ప్రశాంతంగా జీవించగలుగుతున్నామని అన్నారు. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ 13 రోజుల పాటు మండల, గ్రామ స్థాయిలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను అనేక సార్లు అవమానపరిచిందని ఆరోపించారు. అంబేద్కర్ జయంతి రోజే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు ఆయన గుర్తుకు వస్తారని, ఆ రోజు ఫొటోలు దిగి ఫోజులు ఇస్తారని విమర్శించారు. ఏళ్ల తరబడి దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆయన విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టలేక పోయిందని విమర్శించారు. బీజేపీ హయాంలోనే ఆయనకు భారతరత్న అవార్డును ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ దళితబంధు అని వారిని మోసం చేసిన పంథాలోనే కాంగ్రెస్ పార్టీ చేస్తోందని అన్నారు. అంతకు ముందు పట్టణంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక


వెంకటరమణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ- 2 మేళ్లచెరువు వెంకటరమణ కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జగదీష్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు మాశెట్టి శ్రీహరి, అధికార ప్రతినిధి రామ్‌సైదులు, బొలిశెట్టి సుధీర్, యూత్ నాయకులు అనంతు కర్ణాకర్‌గౌడ్, అనంతు తరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో 26 నుంచి ఎడ్ల పందేలు


ఎడ్ల పందేల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఫాదర్ మార్టిన్ పసల, చర్చి కమిటీ పెద్దలు, తదితరులు

మఠంపల్లి : మఠంపల్లి మండల కేంద్రంలో శుభవార్త చర్చి వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకు స్థానిక మాంట్‌ఫోర్డు స్కూల్ మైదానంలో శుభోదయ యువజన సంఘం, చర్చి కమిటీ పెద్దల సహకారంతో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు (బండ లాగుట) నిర్వహించనున్నట్లు రెవరెండ్ ఫాదర్ మార్టిన్ పసల తెలిపారు. ఆదివారం మఠంపల్లిలో ఎడ్ల పందేల కరపత్రాన్ని చర్చి కమిటీ పెద్దలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎడ్ల పందేలను మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన గిత్తల జతలకు రూ.8.75 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాదర్ అల్లం బాలరెడ్డి, బ్రదర్ వినోదరెడ్డి, సిస్టర్లు శౌరీలమ్మ, రూబీనా, చర్చి కమిటీ పెద్దలు బాలరెడ్డి, జార్జిరెడ్డి, జోసెఫ్, అంతోనిరెడ్డి, జోసెఫ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, బాలశౌరిరెడ్డి, యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


హుజూర్‌నగర్ : 40 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, గురువులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1985 – 86 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాటి గురువులు పొదిల జోజి, మేరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండపల్లి సురేఖ పాల్గొని పూర్వ విద్యార్థులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో సహా సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం మాబడి, మా మధుర స్మృతులు అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అదేవిధంగా యమృతి చెందిన గురువులు, తోటి విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చామకూరి గురుపాదం, ఆకుల రాము, గోపాల్ దాస్, వెంకటేశ్వర్లు, ముక్కా ధణేష్, జనిగల శ్రీను, నిడిగొండ భిక్షపతి, పటాన్ మహబూబ్‌అలీ, చింతిర్యాల వెంకటేశ్వర్లు, చింతకాయల కోటయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


కోదాడరూరల్ : సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999– 2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్న నాటి రోజులను గుర్తు చేసుకొని ఆనంద పడ్డారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషాచారి, వీరయ్య, సత్యం, మధుసూదన్‌రావు, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


రెడ్లకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడరూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రెడ్లకుంటలో కోదాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమశాతం ఉండేవిధంగా ఆరబెట్టాలని, తాలు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ బుడిగం నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కునుగుంట్ల శ్రీనివాసరావు, సాధినేని అప్పారావు, గంగవరపు లక్ష్మణ్‌రావు, కనగాల నాగేశ్వరరావు, సీతఈఓ వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

రామకృష్ణయాదవ్‌కు బీపీ మండల్ అవార్డు


రామకృష్ణకు అవార్డు ప్రదానం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, నిర్వాహకులు

మునగాల : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన పచ్చిపాల రామకృష్ణయాదవ్‌కు బీపీ మండల్ అవార్డు లభించింది. రామకృష్ణయాదవ్ చేస్తున్న సామాజిక సేవ, ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తించి ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో గల సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో యాదవ రాజ్యాధికార సాధన సమితి, బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) పేరుతో అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రామకృష్ణ యాదవ్‌ను సన్మానించి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్, బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్, మండల్ యాదవ రాజ్యాధికారి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయం వద్ద జల బిందెలతో మహిళలు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో కనకదుర్గమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ లింగం, నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మహిళలు జల బిందెలతో ఆలయానికి చేరుకొని నంది విగ్రహానికి అభిషేకం చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

హుజూర్‌నగర్‌రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉత్సవ విగ్రహాల్లా ఉన్నాయని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అమరవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమై 25 రోజులు దాటిందని, కోతలు చివరి దశకు చేరుకున్నా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కైందని ఆరోపించారు. మిల్లర్లు మద్దతు ధర కల్పించకపోవడం, పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం రేంవత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్షానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నబి, కామిశెట్టి వెంకటేశ్వర్లు, నాగరాజు, అంజిరెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు ఘన నివాళి


వనజీవి రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల కేంద్రంలో అవిశ్రాంత శ్రామికుడు, దివంగత పద్మశ్రీ వనజీవి దరపల్లి రామయ్య చిత్రపటానికి ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రకృతి పరిరక్షణకు పాటుపడిన మహనీయుడు వనజీవి రామయ్య అని కొనాయాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ బట్టు మధు, సభ్యులు షేక్ యూసుఫ్, యడవల్లి సత్యనారాయణరెడ్డి, సుంకర క్రాంతికుమార్, శ్రీనివాస్, సుబ్బారావు, జంగయ్య, రాజేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : బీసీల ఆరాధ్య దైవం, బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వరిప్రసాద్ వర్ధంతిని ఆదివారం నేరేడుచర్లలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, రాపోలు నవీన్, మల్లయ్య, శ్రీను, నాగేందర్, సత్యం, వెంకట్, ఏసుపాదం, సైదులు, ఏసు పాల్గొన్నారు.

ఊరూరా 'ఉపాధి' జాతర


చిలుకూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు


బేతవోలులో..

- ప్రతిరోజూ రెండు వేల మంది కూలీలకు పనుల కల్పన
- గ్రామాల్లో 550 రకాల పనుల గుర్తింపు

చిలుకూరు : మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా జరుగుతున్నాయి. గ్రామాల్లో గత పది రోజులుగా పనులు చేపడుతున్నారు. మరో నాలుగు నెలల పాటు పనులు కల్పించేలా ఇప్పటికే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 550 రకాల పనులను అధికారులు గుర్తించారు. సుమారుగా రూ.2 కోట్ల పనులు చేపట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రోజుకు సగటున రెండు వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఊర్లల్లో కూలీలతో రోడ్ల వెంట కంపచెట్ల తొలగింపు, డొంక దారుల మరమ్మతు పనులు, పంట కాలువల పూడిక తీత పనులు చేయిస్తున్నారు. పనులు జరిగే చోట కూలీలకు మౌలిక సుదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నందున పనులు జరిగే చోట షామియానాలు, తాగునీటి వంటి సౌకర్యాలను అధికారులు కల్పిస్తున్నారు. అయితే చిలుకూరు మండలంలో సాధారణంగా వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలో మాత్రమే ఉపాధి హామీ పనులు జరుగుతాయి. ఈ ఏడాది మాత్రం అధికారులు ముందస్తుగానే గ్రామాల్లో పనులు ప్రారంభించారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తాం



చిలుకూరు మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పనుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆ ప్రకారం పనులు చేయిస్తున్నాం. నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించేందుకు కృషి చేస్తాం. కూలీ లకు పనికి తగిన వేతనం అందేలా చూస్తాం. పనులు జరిగే ప్రదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు

ధ్యానంతో ఒత్తిడిని అధిగమించొచ్చు


శిక్షణ శిబిరంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు


శిబిరంలో యోగాసనాలు వేస్తున్న స్థానికులు

హుజూర్‌నగర్ : ధ్యానం చేయడంతో మనుషుల్లో స్వీయ ప్రతిభ పెరుగుతుందని, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని హార్ట్ ఫుల్ నెస్ సెంటర్ జోనల్ కోఆర్డినేటర్ సీహెచ్.వరప్రసాద్, డాక్టర్ రామారావు అన్నారు. పట్టణంలోని వాసవి భవన్‌లో శ్రీరామచంద్ర మిషన్, హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత యోగా, ధ్యాన శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానంతో అంతశ్చేతనను చేతనగా మార్చుతుందని వివరించారు. ప్రశిక్షక కనకదుర్గ మాట్లాడుతూ.. ప్రార్థన ఎలా చేయాలనే విషయాన్ని వివరించారు. యోగా మాస్టర్ రామానుజరెడ్డి యోగా ప్రాణాయామ విధానాలపై అవగాహన కల్పించారు. ధ్యానం, యోగా సాధన కోసం ప్రతి ఆదివారం, బుధవారం ఉదయం 7:30 కోటేశ్వరరావు బృందావనంలో సత్సంగం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రశిక్షకులు బీసీహెచ్ వెంకటేశ్వర్లు, లత, మహేంద్ర, అభ్యాసీలు శివశంకర్, పద్మావతి, విజయ్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతగిరి: అనంతగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకట్రాంపురం 11 కేవీ ఫీడర్‌పై ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు వెంకట్రాపురం, అజ్మీరాతండా గ్రామాల్లో గృహాలకు, వ్యవసాయానికి, ఖానాపురం, కోమరబండ, గోల్‌తండా గ్రామాల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ సీతారాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.